క్లుప్తంగా

ఘనంగా ఫేర్‌వెల్ డే



అలరించిన విద్యార్థినుల డ్యాన్స్

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిభద్ర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఫేర్‌వెల్ డే కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోగా, విద్యార్థినుల నృత్య ప్రదర్శన అలరించింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కె.ప్రసాద్ మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. ఎంజాయ్‌మెంట్‌తో పాటు చదువు కూడా ఉండాలన్నారు. బాగా చదువుకుని, భవిష్యత్‌లో ఉన్నత స్థాయి చేరుకోవాలని ఆకాంక్షించారు.

రైతుల సమక్షంలోనే భూ సరిహద్దుల గుర్తింపు



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాధాకృష్ణ

కొమరాడ: రైతుల సమక్షంలోనే భూముల సరిహద్దులు గుర్తించాలని తహసీల్దార్ సీహెచ్ రాధాకృష్ణ సూచించారు. మంగళవారం మండలంలోని ఆర్తాం గ్రామంలో జరిగిన గ్రామసభలో భూముల రీసర్వేపై సమీక్షించారు. సర్వే సక్రమంగా చేయాలని, రైతుల మధ్య నెలకొన్న భూ తగాదాలు పరిష్కారమయ్యేలా సర్వే జరగాలని తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

'గడప గడపకు మన ప్రభుత్వం' పనులపై సమీక్ష



సూచనలిస్తున్న ఎంపీడీఓ త్రినాధులు

పాలకొండ రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గుర్తించిన అభివృద్ధి పనుల ప్రగతిపై ఎంపీడీఓ డొంక త్రినాధులు మంగళవారం సమీక్ష నిర్వహించారు. సచివాలయ పరిధిలో పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20 లక్షల నిధులతో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటివరకు మండలంలోని ఆరు సచివాలయాల పరిధిలో పనులు పూర్తయ్యాయని, మిగతా సచివాలయాల పరిధిలోని పనులు కూడా వేగవంతం చేయాలన్నారు.

చెత్త సంపద కేంద్రం పరిశీలన



చెత్త సంపద కేంద్రం నిర్వహణపై సూచనలిస్తున్న డీపీఓ సత్యనారాయణ

పాలకొండ: మండలంలోని జంపరకోట పంచాయతీ చెత్త సంపద కేంద్రాన్ని డీపీఓ(జిల్లా పంచాయతీ అధికారి) బలివాడ సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. కేంద్రాల నిర్వహణ సక్రమంగా ఉండాలని, ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను ఇక్కడికి తరలించి, ఎరువు తయారు చేయాలన్నారు. ఇక్కడ తయారయ్యే సేంద్రియ ఎరువును సబ్సిడీపై రైతులకు అందజేసి, పంచాయతీకి ఆదాయం సమకూర్చాలని సిబ్బందిని కోరారు. ఆయన వెంట ఈఓపీఆర్‌డీ సత్యం, కార్యదర్శి సరస్వతి ఉన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీఓ గీత

పాలకొండ రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ పీఓ గీత సూచించారు. స్థానిక కస్పా, కోమటి, కొత్త వీధుల్లోని అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు మండల పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం సందర్శించిన ఆమె అక్కడి లబ్ధిదారులకు అందిస్తున్న పౌష్టికాహారం, ప్రీ-స్కూల్ విద్యార్థులకు చేస్తున్న విద్యాబోధనపై ఆరా తీశారు. కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం ఇవ్వాలని, చిన్నారుల బరువు, ఎత్తు సరిచూడాలన్నారు. ఆమె వెంట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరి ఉన్నారు.

సీఎం జగన్‌తోనే మహిళల ఆర్థికాభివృద్ధి

- వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే మహిళల ఆర్థికాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని పెదమేరంగి కూడలిలో వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత నగదు పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళా పక్షపాతి ప్రభుత్వమని, మహిళల అభ్యున్నతి కోసం అనేక పథకాలు, మరెన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. మహిళలకు అన్ని రంగాల్లోనూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యమిస్తున్నారని, మహిళా సాధికారత కోసం ఆయన ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. మహిళలంతా స్వయం ఉపాధి సాధించి, ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్న సదుద్దేశ్యంతోనే వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా పథకాలు ప్రవేశపెట్టి, అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు కూడా ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకుని, ఆర్థిక ప్రగతి సాధించాలని ఆకాంక్షించారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలతో పాటు అంతకుముందు ఆయన చేపట్టిన పాదయాత్ర, ప్రజాసంకల్పయాత్రలో ప్రజలకు ఇచ్చిన వాగ్దాలన్నింటినీ నెరవేరుస్తున్నారని వివరించారు. ఇప్పటివరకు దాదాపు 98 శాతం హామీలు అమలు చేసి, రికార్డు సృష్టించారన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచిపనులు చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వం రావాలని అందరూ కోరుకుంటున్నారన్నారు. అనంతరం వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత కింద మండలంలోని 31 పంచాయతీల పరిధిలో ఉన్న 1091 డ్వాక్రా గ్రూపు మహిళలకు మంజూరైన రూ.5.72 కోట్ల చెక్కును ఎమ్మెల్యే విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.రమేష్, వెలుగు ఏపీఎం వెంకట్, సీసీలు సత్యంనాయుడు, బాలకృష్ణ, మహిళా సంఘ అధ్యక్షుడు అల్లు ఉషారాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మూడడ్ల శశికళ, కన్వీనర్ గౌరీశంకరరావు, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, వైస్ ఎంపీపీ సంపత్‌కుమార్, సచివాలయం కన్వీనర్ అనంత నాయుడు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన మహిళలు

వ్యాపారం పెట్టుకున్నా..



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా అందిస్తున్న ఆర్థికసాయంతో చిన్న వ్యాపారం పెట్టుకున్నా, దాని ద్వారా వచ్చే డబ్బులతో ఒకరి దగ్గర చేయి చాపకుండా కుటుంబమంతా దర్జాగా బతుకున్నాం. సీఎం జగనన్నకు ధన్యవాదాలు.

–తోయక భారతి, పీటిమండ గ్రామం

జగనన్నకు రుణపడి ఉంటాం..



మహిళల ఆర్థిక ప్రగతికి కృషి చేస్తున్న సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత పథకాల ద్వారా చేస్తున్న ఆర్థికసాయం మాకు ఎంతగానో ఉపయోగపడుతోంది. మా అవసరాలు తీరుతున్నాయి.

–నగిరెడ్డి సుశీల, సింగనాపురం గ్రామం

మహిళా ప్రగతి కనిపిస్తోంది..



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలు మహిళా ప్రగతికి ఎంతగానో దోహదపడుతున్నాయి. ఎంతోమంది మహిళలు ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థికసాయంతో చిరువ్యాపారాలు ప్రారంభించి, ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారు.

–వెంకట్, వెలుగు ఏపీఎం

'ఫ్యామిలీ డాక్టర్'తో ఇంటింటికీ వైద్యసేవలు

- మొండెంఖల్ పీహెచ్‌సీ వైద్యాధికారిణి ప్రజ్ఞ



కురుపాం: గుజ్జువాయిలో ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రజ్ఞ



కొమరాడ: కుమ్మరిగుంటలో మంచానపడిన రోగి ఆరోగ్యంపై ఆరాతీస్తున్న వైద్యుడు అరుణ్‌కుమార్

కురుపాం: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ఇంటింటికీ వైద్యసేవలు అందిస్తోందని మొండెంఖల్ పీహెచ్‌సీ వైద్యాధికారిణి ప్రజ్ఞ అన్నారు. మంగళవారం మండలంలోని గుజ్జువాయి గిరిజన గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించి, దాదాపు 60 మందికి వైద్యసేవలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీర్ఘకాల వ్యాధులతో మంచంపట్టిన రోగులు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా అందిస్తున్న వైద్యసేవలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. ఇంటింటికీ వెళ్తున్న వైద్యులు రోగుల ఆరోగ్య పరిస్థితి పరిశీలించి, ఉచితంగా మందులు కూడా అందజేస్తున్నారన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వైద్యారోగ్య సిబ్బంది కె.పెంటమ్మ, పి.మహేశ్వరి, సుఖవాసి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ: మండలంలోని కుమ్మరిగుంట గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యుడు సీహెచ్ అరుణకుమార్ ఇంటింటికీ వెళ్లి, రోగులకు ఆరోగ్య తనిఖీలు చేశారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని బాలలకు కూడా వైద్యపరీక్షలు చేసి, పలు సూచనలు చేశారు.

నేడు వైఎస్సార్ ఆసరా కార్యక్రమం

గుమ్మలక్ష్మీపురం: స్థానిక బీఎస్‌ఆర్ కళింగ వైశ్య కల్యాణ మండపంలో వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత నిధుల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కుంబురుక దీనమయ్య, ఏపీఎం ఆదయ్య ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి హాజరవుతారని, మండల స్థాయి నాయకులు, లబ్ధిదారు మహిళలంతా హాజరు కావాలని వారు కోరారు.

అన్నదానం



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

పాలకొండ రూరల్: పాలకొండ-వీరఘట్టం రోడ్డులో కొలువైన గారమ్మ తల్లికి భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఏడాది ఖరీఫ్ సాగు బాగుండాలని, రాష్ట్ర ప్రజలంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. మధ్యాహ్నం అమ్మవారి ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు.

వసతిగృహం సందర్శన



విద్యార్థినుల వసతిగృహం సందర్శిస్తున్న ప్రిన్సిపాల్ జీవన్‌జ్యోతి

సీతంపేట: స్థానిక పోస్ట్‌మెట్రిక్ బాలికల వసతి గృహాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవన్‌జ్యోతి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి విద్యార్థులకు అందిస్తున్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకుని, జీవితంలో ఉన్నత స్థానంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వ్యాయామం చేసుకోవాలని సూచించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



గరుగుబిల్లి: గొట్టివలసలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



సీతంపేట: ర్యాలీలో అంగన్‌వాడీ కార్యకర్తలు

గరుగుబిల్లి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని, ప్రతిఒక్కరూ ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సులేఖ సూచించారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని గొట్టివలస గ్రామంలో మంగళవారం ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం, దాని వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కలిగించారు. మనం రోజూ తీసుకునే ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు ఉండేలా చూసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎప్పటికప్పుడు చిన్నారుల బరువు, ఎత్తు కొలవాలని, ఏవైనా తేడాలు వస్తే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట: పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. స్థానిక సామాజిక భవనం నుంచి బస్టాండ్ వరకు జరిగిన ఈ ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు కేంద్రాల ద్వారా ఇచ్చే పౌష్టికాహారం తీసుకుని, తినాలన్నారు. తద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీఓ రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

106 ఎకరాల్లో మొక్కజొన్న పంట నష్టం

- కురుపాం వ్యవసాయ సహాయ సంచాలకులు అలజంగి నిర్మల



కళ్లికోటలో నేలమట్టమైన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీ నిర్మల

కొమరాడ: మండల వ్యాప్తంగా ఇటీవల ఈదురుగాలులతో కూడిన కురిసిన వర్షానికి కళ్లికోటలోని దాదాపు 106 ఎకరాల్లోని మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లినట్లు కురుపాం వ్యవసాయ సహాయ సంచాలకులు అలజంగి నిర్మల తెలిపారు. మంగళవారం ఆ గ్రామంలో నేలకొరిగిన మొక్కజొన్న పంటను పరిశీలించిన ఆమె ఈ అకాల వర్షాలు మరో రెండు రోజుల పాటు ఉంటాయని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పంటల కోత పనులను వాయిదా వేసుకోవాలన్నారు. దళాయపేట, గుణానపురం, గంగారేగువలస గ్రామాల్లో జరిగిన పంటనష్టాన్ని అధికారులు అంచనా వేస్తున్నారని, ఇప్పటివరకు 196 మంది రైతులకు సంబంధించి, 175 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు తేలిందన్నారు. ఈ వివరాలను రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శిస్తామన్నారు. మండల వ్యవసాయాధికారి పి.శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ శివ ప్రసాద్

పాలకొండ రూరల్: ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్‌ఐ బి.శివప్రసాద్ సూచించారు. స్థానిక పాలకొండ-వీరఘట్టం, శ్రీకాకుళం, సీతంపేట, పోలీస్‌స్టేషన్ రోడ్లలో మంగళవారం వాహన తనిఖీలు చేపట్టిన ఆయన వాహనాలతో రోడ్లపైకి వచ్చేటప్పుడు సంబంధిత ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలన్నారు. మితిమీరిన వేగం, పరిమితికి మించి లోడు, ప్రయాణికులతో ప్రయాణించినా, మద్యం తాగి డ్రైవ్ చేసినా చర్యలు తప్పవన్నారు. ద్విచక్ర వాహనదారులంతా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు.

నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి సీఎం హామీ

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: నియోజకవర్గంలోని దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ ఇటీవల ముఖ్యమంత్రిని కలిసి స్థానికంగా నెలకొన్న సమస్యలను వివరించామని తెలిపారు. ప్రధానంగా రాజాం-పాలకొండ రోడ్డు నిర్మాణం, ఆస్పత్రిలో బ్లడ్‌బ్యాంకు ఏర్పాటు, ఏనుగుల సమస్యలు, గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం, పంటల నమోదులో ఉన్న ఇబ్బందులు, జంపరకోట రిజర్వాయరు నిర్మాణం, జీడిమామిడి పంటల నష్టపరిహారం, సింగిడి బ్యారేజీ నిర్మాణం వంటి విషయాలను సీఎం జగన్‌కు తెలిపామన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి కూడా సానుకూలంగా స్పందించారన్నారు. సత్వరమే ఆయా సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కురుపాం: స్థానిక కేజీబీవీ(కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం)లో ఆరో తరగతి, ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ప్రత్యేకాధికారిణి కిరణ్‌కుమారి మంగళవారం తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి, చేపట్టే ఈ ప్రవేశాల్లో ఆరో తరగతిలో 40 సీట్లు, ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో మరో 40 సీట్లు భర్తీ చేయనున్నామన్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి ఏప్రిల్ 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తల్లిదండ్రులు లేని పిల్లలు, పేదింటి పిల్లలు, బడి మధ్యలో మానేసిన బాలికలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నామన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నంబర్ 7901098519ను సంప్రదించాలని కోరారు.

వీరఘట్టం: మండలంలోని రేగులపాడు గ్రామ సమీపంలోని కేజీబీవీలో ఆరో తరగతి, ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ రోహిణి ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. ఇంగ్లిష్ మీడియంలో ఆయా తరగతుల్లో 40 సీట్లు చొప్పున భర్తీ చేయనున్నామన్నారు. అర్హులైన వారంతా ఏప్రిల్ 20వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 9912670399ను సంప్రదించాలన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు



జగనన్న గృహ నిర్మాణాలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే కళావతి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే కళావతి



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

వీరఘట్టం: కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై సమీక్షించారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను ఏఓ మన్మథరావు వివరించగా, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు, గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న రోడ్ల నిర్మాణంపై సంబంధిత అధికారులు వివరించారు. అన్ని శాఖల అధికారులు వారి వారి శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులను తెలపగా, నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేపట్టాలని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే సూచించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, అలాగే ప్రజలు ఉపయోగపడే పనులు చేయాలని తెలిపారు. సమావేశంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు జంపు కన్నతల్లి, వైస్ ఎంపీపీ పత్రి విజయకుమారి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు



పూతికవలస అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ రమేష్‌కుమార్



భామిని: కాట్రగడ అంగన్‌వాడీ కేంద్రంలో తహసీల్దార్ అప్పారావు, ఎంపీడీఓ కృష్ణారావు

కురుపాం: మండలంలోని పూతికవలస, మొండెంఖల్, గుమ్మ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తహసీల్దార్ ఆర్.రమేష్‌కుమార్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పి.నాగేశ్వరరావు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం నిల్వలు, రికార్డులు చూసి, సమయానికి లబ్ధిదారులకు సక్రమంగా పౌష్టికాహారం అందజేయాలని సూచించారు. సమయానికి కేంద్రాలను తెరవాలని, చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భామిని: మండలంలోని కాట్రగడ, ఘనసర-1 అంగన్‌వాడీ కేంద్రాలను తహసీల్దార్ నీలాపు అప్పారావు, ఎంపీడీఓ గుర్ల కృష్ణారావు కలిసి మంగళవారం సందర్శించి, అక్కడి రికార్డుల నిర్వహణ, లబ్ధిదారులకు అందజేస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. ప్రీ-స్కూల్ పిల్లలకు చక్కగా విద్యాబుద్ధులు నేర్పాలని, మధ్యాహ్న భోజనం వంటలు రుచికరంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కొవ్వాడ చిరంజీవులు, మండల కార్యదర్శి కిల్లారి పాల్గుణరావు తదితరులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ' జయప్రదం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

పాలకొండ: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు కోరారు. ఇదే విషయమై పిలుపునిస్తూ రూపొందించిన కరపత్రాలను ఆయన మండల కేంద్రంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 5వ తేదీన జరిగే ఈ నిరసన కార్యక్రమంలో అందరూ పాల్గొని, కేంద్రంలోని మోదీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకుడు కాద రాము తదితరులు పాల్గొన్నారు.

గురండిలో శాస్త్రవేత్తల పర్యటన



వరి సాగు పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

భామిని: మండలంలోని గురండి గ్రామంలో సీతంపేట వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం మంగళవారం పర్యటించింది. ఈ సందర్భంగా అక్కడి రబీ వరిసాగును పరిశీలించి, పంటకు పట్టే చీడపీడలు, తెగుళ్ల నివారణకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సీతారాం, లక్ష్మీనారాయణ, సౌజన్య, పాలకొండ వ్యవసాయ సంచాలకులు కె.రత్నకుమారి, ఎంఏఓ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.